## క్లుప్తంగా

### ఉత్తర సర్కారుల బాప్టిస్టు సంఘం మహాసభ

పిఠాపురం: పట్టణంలోని ఆంధ్రా బాప్టిస్ట్ సెంటినరీ చర్చిలో శనివారం ఉత్తర సర్కారుల బాప్టిస్ట్ సంఘముల సంవత్సరీక 68వ మహాసభను వైస్ ప్రెసిడెంట్ కె.సుభద్ర అధ్యక్షతన నిర్వహించారు. క్రైస్తవుల ఆస్తుల పరిరక్షణ, సంఘాల ఐక్యతకు తీసుకోవాల్సిన అంశాలపై చర్చించారు. పలు జిల్లాల నుంచి సుమారు 200 మంది సీబీసీఎన్‌సీ నాయకులు, పాస్టర్లు హాజరయ్యారు. సీబీసీఎన్‌సీ కార్యదర్శి ఏడీకే జాన్, గోదావరి జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు జి.సల్మాన్‌రాజు, కార్యదర్శి కే.శామ్యూల్, కోశాధికారి పి.ఎస్.రావు పాల్గొన్నారు.

### ఇళ్ల నిర్మాణాలు త్వరగా చేపట్టాలి

కొత్తపల్లి: లబ్ధిదారులు తమ ఇళ్ల నిర్మాణాలను త్వరగా చేపట్టాలని ఈఈ పీఆర్డీ భాస్కర్ అన్నారు. హౌసింగ్ డే సందర్భంగా మండలంలోని పొన్నాడ శివారు కోనపాపపేటలో ఉన్న ప్రభుత్వ లే అవుట్‌లో శనివారం లబ్ధిదారులతో సమావేశం నిర్వహించి స్థలం మంజూరైన ప్రతి లబ్ధిదారుడు ఇల్లు నిర్మించుకునేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఇప్పటికే లే అవుట్లలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించినట్టు తెలిపారు.

### రైల్వే పెన్షనర్లకు అండగా వెల్ఫేర్ అసోసియేషన్

సామర్లకోట: విశ్రాంత రైల్వే ఉద్యోగులు, కార్మికులకు అండగా రైల్వే పెన్షనర్ల వెల్ఫేర్ అసోసియేషన్ పని చేస్తోందని ఆ సంఘ ప్రధాన కార్యదర్శి (విశ్రాంత రైల్వే స్టేషన్ మేనేజర్) లక్ష్మణ్ సింగ్ రాజ్‌పుత్ తెలిపారు. స్థానిక పెన్షనర్ల అసోసియేషన్ కార్యాలయంలో శనివారం సంఘ 11వ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంఘ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎంవీవీ రమణ, ప్రధాన కార్యదర్శిగా ఎల్ఎస్ రాజ్‌పుత్, కోశాధికారిగా ఎన్‌వీవీ సత్యనారాయణలతో పాటు మరో ఏడుగురు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘ నివేదికను లక్ష్మణ్ సింగ్ రాజ్‌పుత్ సభ్యులకు వివరించారు. కొత్త పెన్షన్ విధానం కారణంగా విశ్రాంత రైల్వే ఉద్యోగులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సెకండరీ ఫామిలీ పెన్షన్ పెండింగ్ కేసులు పరిష్కరించాలన్నారు. ఫ్యామిలీ మెంబర్స్ అలవెన్సు రూ.3 వేలు ఇవ్వాలని, మెడికల్ రీయింబర్స్‌మెంట్‌ను వేగంగా పరిష్కరించాలన్నారు. అనంతరం సీనియర్ పెన్షనర్లను ఘనంగా సత్కరించారు. సంఘ కాకినాడ బ్రాంచి నాయకులు కేవీ రమణారావు, పి.రామ్‌గోపాల్, ఎ కామేశ్వరరావు పాల్గొన్నారు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు
- జి.రాగంపేటలో గడపగడపకూ మన ప్రభుత్వం



జి.రాగంపేటలో మహిళకు పథకాలు వివరిస్తున్న దవులూరి దొరబాబు

పెద్దాపురం : కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. మండలంలోని జి.రాగంపేటలో శనివారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఏఎంసీ వైస్ చైర్మన్ బండారు వీరబాబు, మాజీ జెడ్పీటీసీ బంగారు కృష్ణ, ఎంపీటీసీ కాలి అనురాధ, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, మార్కెట్ కమిటీ చైర్మన్ వల్లూరి జ్యోతి తదితరులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గత మూడేళ్లలో ప్రభుత్వ పథకాల రూపంలో ప్రతి కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరించారు. రోడ్లు, డ్రైన్లు, విద్యుత్, తాగునీరు, వీధి లైట్లు తదితర సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకురాగా ఆయా సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వైఎస్సార్ సీపీ మండల యూత్ అధ్యక్షులు గోపు మురళి, పంచాయతీ కార్యదర్శి రమేష్‌బాబు, గుడివాడ సర్పంచ్ కనపర్తి చీమదొర, సీబీదేవం ఎంపీటీసీ వెంకటేశ్వరావు, పల్లా శ్రీనివాస్ యాదవ్, ఏలేటి అనంతలక్ష్మి, వల్లూరి కుట్టయ్యచౌదరి, లక్కాకుల నానాజీ, సుందరెడ్డి రాజు, పీతా రాజు పాల్గొన్నారు.

# నవరత్నాలతో సంక్షేమ కాంతులు

- ఎమ్మెల్యే దొరబాబు
- 11వ వార్డులో గడప గడపకూ



పిఠాపురం టౌన్ 11వ వార్డులో స్థానికులకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

పిఠాపురం: నవరత్నాలతో ప్రతి కుటుంబంలో వెలుగులు సంతరించుకున్నాయని ఎమ్మెల్యే పెండెం దొరబాబు పేర్కొన్నారు. పట్టణంలోని 11వ వార్డులో శనివారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి పథకాలు అందుతున్నాయా అని పలకరించి మూడేళ్లలో అందిన పథకాలను వివరించి అవి అందుకోవడంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. మేనిఫెస్టోలో చెప్పిన విధంగా ఇచ్చిన హామీలన్నీ సీఎం జగన్ నెరవేరుస్తున్నారని లబ్ధిదారులు వివరించారు. జగనన్న విద్యాదీవెన, వసతిదీవెన, అమ్మ ఒడి, వైఎస్సార్ చేయూత, నాడు–నేడు వంటి అనేక పథకాలతో ప్రజారంజక పాలన సాగిస్తున్నారన్నారు. ప్రజా సంక్షేమం కోసం పరితపిస్తున్న జగనన్నను గెలిపించాలని కోరారు. పలువురు అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

# ప్రజాదరణ చూసి ఓర్వలేక...

రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు



సామర్లకోట: వలంటీర్ వ్యవస్థతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి వస్తున్న మంచి పేరు, ప్రజాదరణను చూసి చంద్రబాబునాయుడు అండ్ కో జీర్ణించుకోలేకపోతున్నారని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. పట్టణంలో శనివారం రాత్రి ఆయన విలేకర్లతో మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే వలంటీర్ వ్యవస్థను తీసేస్తామని తమ మెనిఫెస్టోలో పెట్టే దమ్ము చంద్రబాబుకు ఉందా ? అని ప్రశ్నించారు. చంద్రబాబుకు ఇవే చివరి ఎన్నికలని తెలిసి జనసేనతో పొత్తు పెట్టుకొంటున్నారని తెలిపారు. ఎన్నికల్లో ఓడిపోతే జనసేన వల్లనే ఓటమి చెందామని చెప్పుకుంటారన్నారు. అవినీతికి అవకాశం లేకుండా వలంటీర్ వ్యవస్థ నడుస్తోందన్నారు. గత టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీల పేరుతో ప్రజలను దొచుకున్నారని ఆయన గుర్తు చేశారు. ప్రస్తుతం నాయకులతో సంబంధం లేకుండా వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందజేస్తున్నారని, దీనికి చూసి చంద్రబాబు, ఎల్లో జీర్ణించుకోలేకపోతున్నాయని తెలిపారు.

# కానిస్టేబుల్ రాత పరీక్షలకు సర్వం సిద్ధం

ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు

పెద్దాపురం: జిల్లాలో ఈ నెల 22న నిర్వహించే పోలీసు కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్ పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్టు జిల్లా ఎస్పీ ఎం.రవీంద్రనాథ్‌బాబు తెలిపారు. పెద్దాపురం అంబేడ్కర్ భవన్‌లో శనివారం సాయంత్రం పరీక్షల నిర్వహణపై సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మొగిలి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు మాట్లాడారు. పెద్దాపురం సబ్ డివిజన్‌లోని సూరంపాలెం ఆదిత్య, ప్రగతి, దివిలి కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలు, పెద్దాపురం మహారాణీ కళాశాలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. పరీక్షల నిర్వహణకు 250 మంది సిబ్బందిని నియమించామన్నారు. సుమారు 15 వేల మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నట్టు ఆయన వివరించారు. డీఎస్పీలు శ్రీనివాస్, సత్యనారాయణ, అంబికా ప్రసాద్ పాల్గొన్నారు.

# ప్రజా సేవలో వైఎస్సార్ కుటుంబం ముందంజ

- ఎమ్మెల్యే దొరబాబు
- కల్వర్టుకు శంకుస్థాపన



సచివాలయ కో ఆర్డినేటర్ రాంబాబును సత్కరిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

కొత్తపల్లి: ప్రజా సేవలో వైఎస్సార్ కుటుంబం ఎప్పుడూ ముందుంటుందని, ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు చూసి ఓర్వలేక మీడియాలు తప్పుడు ప్రచారాలను చేస్తున్నాయని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. పిఠాపురం టౌన్ 11వ వార్డులో రూ.5 లక్షలతో నిర్మించనున్న కల్వర్టుకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఠాపురం టౌన్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు.

**2024లో విజయమే లక్ష్యంగా పనిచేయాలి**

రానున్న 2024 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా సచివాలయ కో ఆర్డినేటర్లు, కన్వీనర్లు కలసి పని చేయాలని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. పిఠాపురం టౌన్‌లోని 11వ వార్డులో ఉన్న స్టువార్టుపేటలో ఉన్న రామాలయం వద్ద పిఠాపురం పట్టణ సచివాలయ కన్వీనర్ల కో ఆర్డినేటర్‌గా నియమితులైన బాలిపల్లి రాంబాబును ఎమ్మెల్యే పెండెం దొరబాబు సత్కరించారు. స్థానిక నాయకులు ఎమ్మెల్యే దొరబాబును సత్కరించారు. వైఎస్సార్ సీపీ విజయానికి ప్రతీ ఒక్కరూ తమ వంతు కృషి చేయాలన్నారు. 11వార్డు కౌన్సిలర్ అరిగెల వరలక్ష్మి, కుక్కుటేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ ఆగంటి ప్రభాకరరావు, బిరుసు వర్ధేష, గండేపల్లి బాబీ, కొత్తపల్లి వీరవెంకట సత్యనారాయణ, బొజ్జా పెద్ద కాపు, బోను దేవా, బొజ్జా దొరబాబు పాల్గొన్నారు.

# శృంగార వల్లభస్వామి ఆలయానికి భక్తుల తాకిడి



అన్నదానం వద్ద భక్తుల రద్దీ



శృంగారవల్లభ స్వామి

పెద్దాపురం: మండలంలోని తిరుపతి శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే వందల సంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఆలయంలో రద్దీ నెలకొంది. స్వామివారి దర్శనానికి గంటల తరబడి భక్తులు క్యూలో నిల్చున్నారు. కాకినాడ జిల్లా దేవదాయ శాఖ కమిషనర్, ఇన్‌చార్జి ఆలయ ఈఓ పులి నారాయణమూర్తి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు స్వామి వారికి తులసీ మాల అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదానం, విరాళాలు, టిక్కెట్ల ద్వారా దేవస్థానానికి రూ.1,44,571 ఆదాయం సమకూరినట్లు ఈఓ పులి నారాయణమూర్తి తెలిపారు. భక్తులకు ఉచితంగా పులిహోర ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కుంచే బుచ్చిరాజు, కర్రి జగదీష్ పాల్గొన్నారు.

### ఉచిత న్యాయ విజ్ఞాన సదస్సు

పెద్దాపురం: మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో అందించే ఉచిత న్యాయ సహాయాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పెద్దాపురం ఏజేఎఫ్‌సీ మెజిస్ట్రేట్ హర్షవర్ధన్ సూచించారు. సీనియర్ సివిల్ జడ్జి వై.బెన్నియ్యనాయుడు ఆదేశాల మేరకు శనివారం కాండ్రకోట నూకాలమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మెజిస్ట్రేట్ హర్షవర్ధన్ మాట్లాడుతూ నిరుపేదలకు లోక్ అదాలత్ ద్వారా న్యాయం చేస్తామన్నారు. బాలికలు దిశ చట్టం పట్ల మరింత అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కల్గి ఉండాలన్నారు. ప్రజలకు చట్టాలపై అవగాహన కల్గితే ఎటువంటి తగాదాలు ఉండవన్నారు. కేసుల సత్వర కేసులు పరిష్కారానికి లోక్ అదాలత్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం న్యాయవాదులు కందుల వెంకటాచలం, మడికి రాంబాబు, విశాలాక్షి, ప్రభూజీ, దుర్గారావు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, సర్పంచ్ మాకిరెడ్డి శ్రీనివాస్, ఉప సర్పంచ్ జోకా నానాజీ, ఎంపీటీసీ జాగు వీరభద్రరావు, నూకాలమ్మ దేవస్థానం చైర్మన్ గవరసాని రామస్వామి, పీఏసీఎస్ అధ్యక్షులు పల్ల గంగారావు, గంటా రామస్వామి, లక్కాకుల నానాజీ పాల్గొన్నారు.

# ఆటోడ్రైవర్ నిజాయితీ



ల్యాప్‌టాప్‌ను సీఐకి అందజేస్తున్న ఆటో డ్రైవర్లు

సామర్లకోట: ఆటోలో మరచిపోయిన ల్యాప్‌టాప్‌ను సీఐ కె.దుర్గాప్రసాద్‌కు అందజేసి నిజాయితీని చాటుకున్నాడు ఆటో డ్రైవర్. వివరాల్లోకి వెళితే.. సామర్లకోటకు చెందిన ఆటో డ్రైవర్ కె.సత్యనారాయణ సూరంపాలెం నుంచి వస్తున్న సమయంలో ఆదిత్య కళాశాల వద్ద విద్యార్థులు ఆటో ఎక్కారు. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం స్థానిక మఠంసెంటర్‌లో ఆటో దిగి వెళ్లిపోయారు. ఆటో పెద్దాపురం ఆటో స్టాండ్‌కు వచ్చిన తరువాత డ్రైవర్ ఆటోలో బ్యాగ్‌ను గమనించాడు. బ్యాగ్‌లో ల్యాప్‌టాప్ ఉండటంతో విద్యార్థులు వస్తారని ఎదురు చూశాడు. రాత్రి వరకూ ఆటో వద్దకు ఎవరూ రాక పోవడంతో స్థానిక అవుట్ పోస్టు వద్ద సీఐ కె.దుర్గాప్రసాద్‌కు ఆటో యూనియన్ అధ్యక్షుడు రొంగల చిన్నా ఆధ్వర్యంలో ల్యాప్‌టాప్‌ను అందజేశారు. ఆటో డ్రైవర్లను సీఐ, ఎస్సైలు అభినందించారు.

# అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారి ప్రసాద్, సిబ్బంది

పెద్దాపురం: విద్యార్థులకు అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన ఎంతో అవసరమని పెద్దాపురం అగ్నిమాపకాధికారి ప్రసాద్ అన్నారు. మండలంలోని కాండ్రకోట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శనివారం ఎవాక్యువేషన్ డ్రిల్ పేరిట విద్యార్థులకు అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం శ్రీవల్లి అధ్యక్షతన జరిగిన సదస్సులో అగ్నిమాపకాధికారి ప్రసాద్ మాట్లాడుతూ విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు ప్రతి ఒక్కరూ మనోధైర్యంతో ఉండాలన్నారు. విద్యార్థి దశ నుంచే అగ్నిప్రమాదాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, సర్పంచ్ మాకిరెడ్డి శ్రీనివాస్, ఉప సర్పంచ్ జోకా నానాజీ, ఎంపీటీసీ జాగు వీరభద్రరావు, విద్యాకమిటీ చైర్మన్ వాడ్రేవు, నూకాలమ్మ దేవస్థానం చైర్మన్ జి. రామస్వామి పాల్గొన్నారు.